# ఎంగిలి మెతుకులు

సత్రమంతా బిక్కుబిక్కుమంటోంది. మసిబారిన మొండి గోడలు అర్ధరాత్రి శ్మశానంలో గోరీల్లా నిలుచున్నాయి. మధ్య మధ్య మసిబొగ్గుతో గీచిన అడ్డమైన నానారాతలు చిందర వందరగాఉన్నాయి. ఏళ్ళతరబడి సంస్కారంలేని సత్రవ దూలాలనుండి సాలీడులు వ్రేలాడుతూ గాలికి ఉయ్యాలలు ఊగుతున్నాయి. కుండపెంకులు, కాగితంముక్కలు ఆసత్రవ నలుమూలల అగుపిస్తున్నాయి.

అంతవరకూ కథచెప్పుతూన్న గెడ్డంసాధువు కునికిపాట్లతో ఆవలిస్తున్న చుట్టూఉండే జనాన్ని చూసి కథ మరుచటిదినానికి వాయిదావేసి అక్కడేనడుంచేరేశాడు. సత్రవపెద్ద చావడిలో అప్పుడే నిద్రాదేవి ఒడిలో గట్టిగా గుర్రుపెడుతూన్న వెంకాలు కాల్చిపారేసినచుట్టపీకెనుండి యింకాపొగవస్తూనేఉంది. నిద్రలోకాస్సేపు కలవరించిన నాగులు తిరిగి చప్పబడిపోయాడు.

చిమ్నీలేని కిరసనాయిలుదీపం గాలికి అటూయిటూ ఊగి ఆరిపోయింది. నలువైపులా దట్టంగా ఆవరించిన అంధకారం మధ్య నిశ్శబ్ధంగాఉన్న సత్రవలో కొంచెం సంచలనం కలిగింది.

అందంగా ముస్తాబైన 'రావి' నలిగిపోయి వాడిపోతున్నట్టున్న కనకాంబరందండ జెడలోంచి జారుతుంటే సత్రవ చేరుకొని ఓమూల చతికిలబడింది. అలికిడివిని లేచిన మంగి ఓప్రక్కకు వత్తిగిల్లి "ఏందే! ఓరూదొరకనేదా?" అంది నిద్రకళ్ళతోనే.

"ఊరొక్కసే. పోలీసొత్తుండాడు. ఎదీకాత్తా అలాజరుగు. నీపక్కనిద్దరోతాను." మంగి పక్కకుజేరి ముసుగుకప్పింది.

"ఓయబ్బో! భయంగలపిల్లే. ఇట్టాఅయితే యేపారం ఏంసాగుద్దంటే?" మంగిముసుగులోంచి గుసగుసమన్నట్టుగా అంది.

"నీక్కాదంటే సెప్పేది. పోలీసొత్తుండాడు. కాస్సేపు మాటాడక తొంగో."

మంగి మరింకేమీ మాట్లాడలేదు. ప్రక్కనుండి భారంగా వినిపిస్తోన్న ఉచ్ఛ్వాస నిశ్వాసాల్ని వింటూ ఉండిపోయింది.

సత్రవబయట ఉక్కుబూట్లశబ్దం గుమ్మంవరకూ వచ్చి ఆగిపోయింది. ముసుగులోని రావి గడగడా వణికిపోయింది. కన్నంలోంచి చూస్తే బయట ఒక తెల్లటిఆకారం ప్రక్కనున్న పోలీసుతో ఏదో చెప్పి సత్రవలోకి చూపించి వెళ్ళిపోవడం కనుపించింది. రావి ఊపిరి బిగబెట్టి అలికిడి వినడానికి ప్రయత్నించింది. కాస్సేపటివరకూ ఎలాంటి శబ్దమూ వినిపించలేదు. ఆతర్వాత క్రమంగా శబ్దంతగ్గిపోయి అంతరించిపోయింది.

ఈసారి గట్టిగా ఊపిరి విడిచి ముసుగునెట్టి లేచికూర్చుంది. "ఈయాల ఆడిసేతుల్లో పడేదాన్నే. నాయాల సూసినట్టుండాడు." అంటూ సత్రవగుమ్మంవరకూ వచ్చి అటూ ఇటూ తొంగిచూసి మళ్ళీ మంగి ప్రక్కగావచ్చి కూర్చుంది.

"అసలేం జరిగిందంటే?" అంది విసుగ్గా మంగి రావి భయానికి కారణం ఏమిటో అర్థంగాక.

"నా నోట్లో దుమ్ముపోత్తే ఆమాత్రం బాగుపడతాడంటే. ఈయాల రూపాయిడబ్బులు సేతులో కొత్తదనుకున్నాను. ఆ బాబుగారు రూపాయి యిత్తానన్నారు. ఆఖరిని వెళ్ళిపోయేటప్పుడు అడిగితే యింకో రూపాయి యిచ్చేవారు.

"అలా గోదారొడ్డు స్కూలులోకి తీసుకెళ్ళాను. అయిదు నిమిషాలయినా కాలేదు. ఆ ముసలిముండాకొడుకు - ఇస్కూలు సూత్తుంటాడు - ఆడు "ఓ రక్కడ" అని గట్టిగా అరుత్తుండాడు. ఆడికళ్ళల్లో కారంజల్లా. ఆడికి అప్పుడప్పుడు కాఫీకి డబ్బులుయిచ్చినా ఎదవ అల్లరిసేసిపారేశాడు. ఆడి గోల యిని రేత్రి గస్తీ తిరుగుతుండే పోలీసోడు యిస్కూలులోకి వత్తుండాడు. ఇంకప్పుడు నా పాణం పైకెగిరిపోయిందంటే నమ్ము. ఆ బాబుగారు చేతిలో డబ్బులుపెట్టకుండా గోడదూకి పోయారు. ఆడముండని నేనొక్కర్తినే ఏంసేసేది?

"రాత్రి గంజి కాసినాక మిగిలినబేడ మొల్లోదాసింది తీసి ముసలోడి సేతుల్లో పెడ్తే "ఓసి నువ్వాటే, ఓరో అనుకున్నాను" అన్నాడు. ఆడిదంతా ఎదవనాటకం. డబ్బులు గుంజుదామని ఆయెత్తేసాడు. "మరిప్పుడు నే నెలాబయటికి పోయేది ముసిలోడా" అని అడిగితే "గోడదూకలేవటే. ఆమాత్రందానికి ఈపనెందుకు సేత్తుంటావే? ఊ పరుగెత్తిపోవే. పోలీసోడు సూత్తే నా పీకకట్టుకుంటాది" అన్నాడు. అప్పుడు నేనింకేం సేసేది. ఆడనించి యెనకాలగోడ దూకి పరుగెత్తుకొచ్చాను. ఆడు సూసేఉంటాడు. ఎదవ. ఆముసలోడు ఈసారి కనబడనీ. చడమడా నాలుగు తిట్టేత్తాను. ఏంచైనా అంటే ఆడి సంగతి నాకు తెలీదేంటి. ఆడి కూతురు ఆ సాయిబుగాడితో తిరగడంలేదూ?"

"ఓలె! యెంతసేసినా ఓ కానీకూడా దొరకలేదంటే"

"ఏందే. ఇంకానాదగ్గిర బేడ వదిలింది. ఈయాల ఏపని

సేసినా యిలా తగులడుతోంది. పొద్దున్న గంపెత్తుకొత్తుంటే; ఓ బాబుగారిని అలాంటోళ్ళే మోనని ఉండలేక ఏదో అన్నాను. ఆరు బజార్లో జోడె త్తి కొట్టడానికి కూడా వచ్చారు మొన్న రేత్రి సిన్న సెట్టి ఈడకి ఒచ్చాడని ఆరిబాబు ఎలాయిన్నాడో మరి మద్దేన్నం కూరెత్తుకొత్తుంటే చెళ్లున లెంపకాయకొట్టి "ఈయాలగనక ఊరుకొన్నాను. ఇంకెప్పుడయినా యిలా సేసేవంటే కొట్లో పెట్టిత్తా" నన్నారు. అసలు ఆరిని యిక్కడకు రమ్మన్నానా? ఆరే వచ్చారు? దానికి నేనేం తప్పుసేసాను? ఓయూ బుద్ధిసెప్పేఒళ్ళు లేకపో తేసరి".

సత్రవమూలఏదో అలికిడైనట్టయింది. ముసుగులోంచి తల బయటకు వచ్చి పురుషస్వరంతో "ఆడముండలు యింకా నిద్దరోలేదటే" అంది.

"నువ్వు నిద్దరోయేమంగి నేవత్తాను" అని ముసుగు మనిషి దగ్గరకు వెళ్లింది రావి. ముసుగు తొలగిస్తూ "ఏంబావా ప్రక్కన జేరబడమంటావా" అంది.

"నీకు ఎప్పుడూ యిదేనేంటే నిద్దరపోనియ్యవేందే?" అని ఓప్రక్కకు జరి గాడు. రావి ఒళ్లు ఓమారు విరుచుకొని ప్రక్కనే జేరబడి ముసుగు మీదకు లాక్కుంది. చలికాలపు మంచుగడ్డ లాంటినాపరాతిమీన వెచ్చగా ఉండేలాగ ఆపాద మ స్తకం ముసుగు కప్పి "ఇంకొంచెం యిటు జరుగు బావా" అంది. అంతా నిశ్శబ్దం. చీకట్లోని ముసుగుల కదలిక!

మళ్ళీ ఉక్కుబూట్లు శబ్దంచేసుకొంటూవచ్చి సత్రవముందు ఆగాయి. ముసుగులోని మనిషిని యింకాగట్టిగా అంటిపెట్టు

కుంది రావి. శీతాకాలపు చలికొరుకుతూఉంటే చుట్టూ ఆవ రించిన భయానికి మరింతగా వణికిపోతూఉంది.

పోలీసు గుమ్మం దాటుకొంటూ వచ్చి "ఎవరక్కడ?" అన్నాడు. కంచుగంట ప్రతిధ్వనించినట్టుగా ఆశబ్దం భయంక రంగా ప్రతిధ్వనించింది.

రావి లేచి కూర్చుంది. పోలీసు అగ్గిపుల్లగీసి చూశాడు. గడ్డిపోచలాగ గజగజ లాడుతోంది రావి.

"ఓసీ నువ్వశే! ఏమిటి రావీ, యిందాక నువ్వేనా యిటు పరుగెత్తుకొచ్చావు?" అన్నాడు పోలీసు వెంకటస్వామి.

రావి ఆశ్చర్యపోతూ "నువ్వా మావా! ఓరో అను కున్నాను" అంది.

"నీకు ఎన్నిసార్లుచెప్పానే యిలా బయటతిరగొద్దని. ఇంకో పోలీసెవడైనా చూస్తే జైలులోకి తీసుకెళ్ళతాడు తెలుసా? నేంగనక ఊరుకున్నాను" వెంకటస్వామి మీసాన్ని మెలి పెడుతూ, ఆ మెలిపెడుతూన్న మీసం క్రిందుగా చిఱునవ్వును చూపిస్తూ అన్నాడు.

రావి మాటాడకూరుకుంది. "ఇటువంటివి చాలా చూ శాంలే" అన్నట్టుగా. ఆతర్వాత ఏదో జ్ఞాపకంవచ్చి "ఇందా కోసారి యిట్టావచ్చావుకద మావా" అంది.

"అదేనే. ఓమారు నాలుగు వీధులు తిరిగి ప్యాటీకాగానే వెళ్ళిపోయేటప్పుడు యిలా వద్దామని వచ్చాను."

"అయితే నీకూండా ఆరెవరినో సూసాను. ఎవరేంటి?" వయ్యారంగా రెండుచేతుల్ని వెంకటస్వామి భుజంమీద వేసి అంది.

"ఎవరయితే నీకెందుకులే. ఇందాక గోడదూకి పోయాడు గదా ఆయన" చెప్పకూడదనుకునే చెప్పేశాడు.

"ఆరెదగ్గర ఎంతడబ్బు నాగేవేంటి?" ఆతృతగా అడిగింది రావి.

"ఏదోలేవే. ఓ పదిరూపాయలు. పర్సులో ఉన్నవే అంత. రేపు డాక్టరుకు ఫీజుకట్టడానికి సరిపోతుంది" రావి వాటా ఏమైనా కూడుతుందేమో నని ముందే సరిపెట్టి చెప్పాడు.

రావి ఆశగా గుడ్లను చుట్టూ తిప్పింది. ఆ కళ్ళల్లో ఆవేదన తొణికిసలాడింది. "నువ్వేనయం మావా. ఏం కష్టపడకుండా పదిరూపాయలు సంపాదించావు. నేనింత సేసినా సిల్లు కానీ కూడా సేతులోకి రాలేదుగదా?"

"పోనీలేవే. ఒకేరోజే అంత. అయినా ఈ యెధవపని నువ్వు మానేరాదుటే."

"మానేసి ఏంసెయ్యమంటావు? కూడుకే గతిలేనప్పుడు ఏంసేత్తే ఏవొచ్చిందేం?" ఆవేశంతో అంది రావి. ఆమాటలు నిజంగా అగ్నిపర్వతం ప్రేలినప్పుడు ఎగిరిపడే బండరాళ్ళ లాంటివి. హృదయంలో కొన్ని సంవత్సరాలుగా గూడు కట్టు కొన్న ఆవేదన హృదయాన్ని చీల్చి మాటలుగా బయటపడ్డాయి.

వెంకటస్వామి ఆమె ముఖంలోకి చూశాడు. ఆమె కళ్ళల్లో నీళ్ళు తిరుగుతున్నాయి. "పోనీలే. నేను చెప్తేమాత్రం వింటావా. అలా మూలకెల్లొంపడ." అన్నాడు హుషారుగా ఆమె భుజంమీద చెయ్యి వేస్తూ.

"ఇప్పుడొద్దు మావా. రేపురా సూద్దాం." అంది రావి

అలసిపోయినా ఆమె శరీరానికి కాస్తంత విశ్రాంతి నిచ్చే ఉద్దేశంతో.

వెంకటస్వామి గంభీరంగా ఆమెవైపు చూశాడు. నోట్లో చుట్టను బైటకుతీసి పొగను రావి కళ్ళల్లోకి వదులుతూ "ఏమిటే నే నడిగితేనే అలా అంటావు. ఇంకో రెవరైనా అయితే ఎగిరి మరిపోతుంటావు. ఫరవాలేదులే. యిటురా." అంటూ ఆమె చెయ్యి పట్టుకొని. చీకటిమూలలవైపుగా లాగాడు. నిర్జీవంగా ఆమె అతనివెంట వెళ్ళింది.

కాకులు కావుకావు మన్నాయి. కోడి కొక్కొరోమంది.

"రేపు కూడా వండుకోడానికి గింజలు లేవు మావా" అని గొణుక్కున్నట్టుగా అంటున్న రావి మాటలు వినిపించుకోకుండా బూట్ల శబ్దం చేసుకొంటూ వెళ్ళిపోయాడు వెంకటస్వామి. రిక్త హస్తాలతో కొయ్యబొమ్మలా నిలబడిపోయింది రావి. ఆమెచుట్టూ ఏముందో కనిపించలేదు. ఒక్క ముదనష్టపు బ్రతుకులోని ఎంగిలిమెతుకుల ఆంతర్యం శూన్యంగా మాత్రం గోచరించింది!